


శివకుమార్‌తో డాక్టర్ గాంధీ, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ మోహన్‌దాస్, ఛైర్మన్ మల్లిక తదితరులు

## విజయవంతంగా

# కాలేయ మార్పిడి

**చెన్నై, న్యూస్‌టుడే:** నగరంలోని మియాట్ ఆసుపత్రిలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగామంగళవారం విలేకరుల సమావేశంలో వైద్య నిపుణులు డాక్టర్ గాంధి, ఎండీ డాక్టర్ మోహన్‌దాస్, జేఎండీ డాక్టర్ పృథ్వీ, ఛైర్మన్ మల్లిక మోహన్‌దాస్ మాట్లాడారు. వైద్య రంగంలో ప్రస్తుతం మూత్ర పిండాల తరహాలో కాలేయ మార్పిడి అత్యంత కీలకమైందని తెలిపారు. ఈరోడ్‌కు చెందిన శివకుమార్ (38) కాలేయ సమస్యతో సతమతమవుతూ దాతల కోసం ఎదురు చూస్తున్నారు. తిరుచ్చిలోని ఒక దాత ముందుకు రావడంతో వెంటనే విషయాన్ని శివకుమార్‌కు తెలిపి చెన్నైకి తీసుకువచ్చారు. వైద్య నిపుణుల బృందం తిరుచ్చివెళ్లి దాత కాలేయాన్ని ఆధునిక వైద్య పద్ధతిలో భద్రపరచి విమానం ద్వారా నగరంలోని మియాట్ ఆసుపత్రికి యుద్ధ ప్రాతిపదికన తీసుకొచ్చింది. కాలేయానికి అంటువ్యాధి సోకకుండా భద్రపరచటం అతి ముఖ్యమైన అంశం కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అప్పటికే మరో వైద్య బృందం శస్త్ర చికిత్స మార్పిడికి సిద్ధంగా ఉండటంతో ఎక్కువ సమయం వ్యర్థం కాలేదని పేర్కొన్నారు. తిరుచ్చి నుంచి ఆసుపత్రికి వచ్చిన అరగంటలో మార్పిడి పనులు చేపట్టామని తెలిపారు. ఎనిమిదిన్నర గంటలపాటు అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో ఈ కాలేయ మార్పిడిని విజయవంతంగా నిర్వహించామని సంతోషం వ్యక్తం చేశారు. శస్త్ర చికిత్సకు ముందు వంద కిలోల బరువుగల శివకుమార్ మార్పిడి, చికిత్స అనంతరం 78 కిలోలకు చేరుకుని పరిపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వివరించారు.